## పోలింగ్ స్టేషన్ పరిశీలన




మీడియాకు వివరాలు తెలుపుతున్న ఆర్వో చంద్రకళ

అలంపూర్, నవంబర్ 13: అలంపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు వసంతకుమార్ పరిశీలించారు. ఓటర్ల జాబితా ఓటర్ల వివరాలు, జాబితాలో తొలగించిన వారి వివరాలపై ఆరా తీసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట రిటర్నింగ్ అధికారిణి చంద్రకళ, తాసీల్దార్ మంజుల తదితరులున్నారు.

**ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారమే**

అభ్యర్థుల నామినేషన్ పత్రాల పరిశీలన ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించినట్లు ఆర్వో తెలిపారు. కాంగ్రెస్, బీఎస్పీ, ఇతర పార్టీల అభ్యర్థులు బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు నామినేషన్ పత్రాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేసిన పత్రం సమర్పించలేదని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. అన్ని పత్రాలు సరిగ్గా ఉన్నందునే ఆమోదం తెలిపినట్టు మీడియాకు వివరించారు.

## విప్ బాలరాజుపై దాడి ఎలక్షన్ అధికారికి ఫిర్యాదు

- ప్రేరేపించిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) :అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన దుండగులు దాడికి పాల్పడడంపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. దాడికి ప్రేరేపించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితోపాటు దాడికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, రేవంత్ కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి అనర్హుడిగా ప్రకటించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇటీవల దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కూడా కత్తితో దాడికి పాల్పడిన ఘటన మరవకముందే మరో ఎమ్మెల్యే గువ్వలపై దాడి చేయడం అమానుషమన్నారు. ఓటమి భయంతో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడులకు కాంగ్రెస్ పార్టీకి చెందిన దుండగులను ప్రేరేపిస్తున్న పార్టీ అధినేత రేవంత్ రెడ్డిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, స్పోక్స్ పర్సన్ దాసోజు శ్రవణ్‌కుమార్, హైకోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కల్యాణ్‌రావు చెంగల్వ, లీగల్ సెల్ సభ్యులు లలితారెడ్డి, జక్కుల లక్ష్మన్ పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి, నవంబర్ 13: రెండు వాహనాల్లో 114 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డ ఘటన కేటీదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం ప్రకారం.. గద్వాల నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా రాయచూర్ వైపు వెళ్తున్న డీసీఎంలో ఎక్కువ మొత్తంలో(90 క్వింటాళ్లు) రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారంతో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో డ్రైవర్ గోవిందు, ఓనర్ మిల్లు వీరన్నపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో వాహనం బొలేరాలో ధరూర్ నుంచి కేటీదొడ్డి మండలం వైపు సుమారు 24 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు మండలంలోని పాతపాలెంలో రైడ్ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. విషయంలో ఎరుకలి నవీన్, హనుమంతులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### కదులుతున్న పల్లెలు

# బీఆర్ఎస్‌కే జైకొడుతున్న జనం

- కేసీఆర్‌కు పెరుగుతున్న మద్దతు
- తండాల్లో ఏకగ్రీవ తీర్మానాలు
- ప్రతిపక్షాలు వద్దంటూ నినాదాలు
- అధికారపార్టీ వైపే కుల సంఘాలు

వనపర్తి, 13 నవంబర్(నమస్తే తెలంగాణ): సమైక్యపాలనలో తెలంగాణ ప్రజలను ప్రజలుగా చూడలేదు. చెప్పేదొకటి.. చేసిందొకటి అన్నట్లుగా సాగించిన నాటి పాలనలో ప్రజలు ఎంత నష్టపోయారో గడచిన తొమ్మిదేళ్ల టీఆర్ఎస్ పాలన ద్వారా స్వయంగా తెలుసుకుంటున్నారు. ఓట్లొచ్చినప్పుడు లొల్లి చేసి చేతులు దులుపుకునే పార్టీలు మళ్లీ ఎన్నికలప్పుడే గ్రామాలకు వచ్చే పరిస్థితులను పల్లె జనం గమనిస్తున్నారు. ప్రభుత్వం మంటే ఎప్పుడు ప్రజల కోసం పని చేయడం అన్నట్లు మంత్రులు,ఎమ్మెల్యేలు గ్రామాలను అంటిపెట్టుకుని ఉండటం...అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పేద ప్రజలకు అందించడంలాంటివి గొప్పమార్పుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. పెద్దమందడి మండలం ఎర్రగట్టుతండా ఎన్నికల్లో ఏకగ్రీవంగా బీఆర్ఎస్‌కు అండగా నిలివాలని తండా పెద్దలంతా నిర్ణయించారు. బలిజపల్లి పంచాయతీకీ ఆమ్లెట్ గ్రామంగా ఉన్న ఈ తండాకు 2018లోనే సాగునీటి వసతి సమకూరింది. అలాగే తండాకు బీటీ రోడ్డును వేయించారు. ఇదంతా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చొరవతోనే పూర్తి చేశారు. సాగునీరు వచ్చిన అనంతరం తండా భూముల్లో పంటలు పండిస్తు గిరిజ కుటుంబాలు జీవనం చేస్తున్నారు. అలాగే వీటితోపాటు ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను సహితం గ్రామస్తులు అందుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బలిజపల్లి సర్పంచ్ జయంతి సమక్షంలో ఇటీవల తండా పెద్దలంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని తీర్మానం చేశారు.కొత్తకోట మండలం పాతజంగమాయిపల్లి కనిమెట్టకు ఆమ్లెట్ గ్రామం. ఈ గ్రామానికి అనుసరించుకుని ఊకచెట్టు వాగు ఉంది. వర్షాకాలంలో ఊక చెట్టు వాగులో నీరొచ్చినప్పుడల్లా పాత జంగమాయిపల్లికి రాకపోకలు నిలిచిపోతాయి. ఈ సమస్యను 60ఏండ్ల నుంచి గ్రామస్తులు ఎదుర్కొంటున్నారు. అప్పట్లో ఉన్న ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నా సమైక్యపాలనలో ఎవరూ పట్టించుకోలేదు. సరికదా..ప్రస్తుత ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాతజంగమాయిపల్లికి మహర్దశ కల్పించారు. దాదాపు రూ.12. 50కోట్లను మంజూరు చేయించి ఊకచెట్టు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బ్రిడ్జి నిర్మాణం 90 శాతం పూర్తయింది. కేవలం కొద్దిమేర మాత్రమే పని మిగిలింది. అలాగే ఆమ్లెట్ గ్రామంగా పాత జంగమాయిపల్లిని ఇటీవలే కొత్త పంచాయతీగా ప్రభుత్వం నుంచి గెజిట్ విడుదలయ్యేలా ఎమ్మెల్యే ఆల చొరవ తీసుకున్నారు. ఇలా ప్రధాన సమస్యలు తీరిపోవడంతో పాతజంగమాయిపల్లి గ్రామస్తులంతా బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని తీర్మానం చేశారు.



ఊకచెట్టు వాగులో ట్రాక్టర్‌పై వెళ్తున్న పాతజంగమయాపల్లి వాసులు

**సమైక్యంలో అన్ని సమస్యలే..**

సమైక్యపాలనలో గ్రామాలు ప్రధాన సమస్యలతో సతమతమయ్యాయి. ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నా అప్పట్లో పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ అంశాన్ని తెలంగాణ ఉద్యమంలో జరిగిన ప్రతిసభలోనూ నాటి ఉద్యమ నేత, నేటి సీఎం కేసీఆర్ ప్రస్థావించి ప్రజలకు కనువిప్పు కలిగించారు. ప్రాథమికంగా అవసరమైన వాటిని కూడా సమైక్యపాలనలో నిర్లక్ష్యం చేశారు. తెలంగాణ ఏర్పాటుతోనే ఇక్కడి పల్లె ప్రజలకు ప్రభుత్వ నుంచి పథకాలు నేరుగా అందుతున్నాయి. ప్రధాన సమస్యలను తొలగించడంతోపాటు ముఖ్యంగా సాగునీరు, ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, సేద్యానికి ఉచిత కరంట్, సర్కార్ వైద్యం లాంటివన్నీ పుష్కలంగా అందుతున్నాయి. గత సమైక్య ప్రభుత్వాలు పట్టించుకోనందు వల్లే వేలాది నిరుపేద జనం వలసలకు నిలయమయ్యారు. ప్రస్తుతం సాగునీటి వనరులు పుష్కలంగా రావడంతో ఎక్కడిక్కడ సేద్యం పనులు.. సర్కార్ సంక్షేమ పథకాలు దండిగా ప్రజలకు అందుతున్నాయి. ఈ క్రమంలోనే గ్రామాలు.. తండాలు బీఆర్ఎస్ ప్రభుత్వానికి అసెంబ్లీ ఎన్నికల్లో అండగా నిలబడాలని తీర్మానాలు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే, మరికొన్ని ప్రాంతాల్లోనూ ఆయా కులసంఘాల పెద్దలు సైతం ఏకమొత్తంగా బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తామంటూ నిర్ణయాలు తీసుకుంటుండటం సరికొత్త ఊపును తెస్తున్నది.



బీఆర్ఎస్‌కే ఓటు వేస్తామని తీర్మానం చేస్తున్న ఎర్రగట్టుతండా వాసులు

**200 పింఛన్ రూ.2వేలయ్యింది**

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమ స్ఫూర్తితోనే వివిధ సంక్షేమ పథకాలను గడచిన తొమ్మిదేండ్లు అమలు చేసింది. ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి వరకు ఇదే స్ఫూర్తిని ప్రజలతో చాటుకున్నారు. నాడు సమైక్యపాలకులు ఇచ్చిన 200 పింఛన్‌కు పదిరెట్లు పెంచి రూ.రెండు వేలను అందించేలా చేయడం వృద్ధులందరికీ చేదోడుగా నిలుస్తున్నది. అలాగే వికలాంగులకు ఒకేసారి రూ.3వేల పింఛన్ అందిస్తూ ధైర్యంగా బతుకు భరోసా ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఇదిలా ఉంటే, ఆసరా పింఛన్లను మళ్లీ వచ్చే ప్రభుత్వంలో అంచెలంచెలుగా పెంచుతూ రూ.5వేల వరకు ఆసరాను ఇవ్వనున్నట్లుగా సీఎం కేసీఆర్ ప్రకటించారు. అదేబాటలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రారంభించి నేడు రూ.లక్షా 116ను ఆడపిల్ల తండ్రికి ప్రభుత్వం అందజేస్తుంది. అన్నిటికి మించి రైతు బంధు పథకాన్ని ప్రవేశపెట్టి విజయవంతంగా సీఎం కేసీఆర్ అమలు చేశారు. ఈ పథకం రైతుల కడగండ్లను తుడిపి వేయగా, నేడు వారి కండ్లల్లో ఆనందం నింపిన పథకంగా రైతుబంధు నిలుస్తున్నది. అదేరైతులకు రైతుబీమా ఏర్పాటు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన సర్కార్‌గా ప్రజల్లో సీఎం కేసీఆర్ పాలన ముద్రవేసింది. ఈ పథకాలు మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ పథకాల ప్రభావంతోనే నేడు గ్రామాల ప్రజల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. రాజకీయంగానూ బీఆర్ఎస్‌కు బాసటగా నిలిచేలా ఈ సంక్షేమ పథకాలు దోహదం చేస్తున్నాయి.

### వర్షం వస్తే...బాట బంద్



వర్షం వస్తే మా ఊరికి బాట బంద్. ఏమైనా ఎండకాలమే మాకు రస్తా. వానకాలం వచ్చిందంటే మా గోస చెప్పడానికి రాదు. తెలంగాణ రాకముందు దరఖాస్తులిచ్చినం.. దండాలు పెట్టినం. అయినా ఎవరు చేతపట్టలే. తెలంగాణ వచ్చినంక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకున్నడు. ఇప్పుడు మాకు బ్రిడ్జి వచ్చింది. కొద్దిగా పనులు అయితే పూర్తి అయిపోతుంది. ఊకచెట్టు వాగులో నీరు వచ్చినప్పుడల్లా మా గోస చెప్పనలివి కాదు. వాగులో నీల్లున్నప్పుడల్లా పుట్టిలోనన్న పోవాలే .. ఆడవాల్లు ట్రాక్టర్ మీద పోవాల్సిందే. ఎమ్మెల్యే రుణం మా గ్రామస్తులమంతా ఓట్లు వేసి తీర్చుకుంటం. మేం తీర్మానం కూడా చేసినం.

**- బోయ కొండన్న, పాతజంగమాయిపల్లి, కొత్తకోట మండలం**

### సర్కారు సాయం మరువలేం



గతంలో ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నామో ఆ దేవుడికి తెలుసు. ఇంత కాలం మేం నరకం అనుభవించాం. రూ.12కోట్లకుపైగా బ్రిడ్జికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఆల మా గ్రామానికి మరిచిపోలేని పని చేశారు. అలాగే మా గ్రామాన్ని పంచాయతీగా కూడా ఏర్పాటు చేయించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే పనులు బాగా జరుగుతున్నాయి. గతంలో ఎవరు పట్టించుకునే పరిస్తితి లేదు. వర్షం వచ్చిందంటే చాలు పిల్లలకు బడి బంద్.. ఊరి వాళ్లకు రస్తా బంద్ అన్నట్లు ఉండే. మాకు పంచాయతీగా కనిమెట్ట ఉండింది. ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో మా గ్రామం ఒక్కటే పంచాయతీగా ఏర్పాటైంది. మాకు ఇలా రెండు పెద్ద సమస్యలను 60ఏండ్ల తర్వాత తీర్చుకున్నాం.

**- వేపాల్‌రెడ్డి, పాత జంగమాయిపల్లి, కొత్తకోట మండలం**

# ఎన్నికల వేడిలో..'చల్లా' గాలి

- ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్
- విజయుడి విజయమే పరమావధిగా..
- గల్లీ నుంచి జిల్లా వరకు అందరి మద్దతు

అలంపూర్, నవంబర్ 13: ఎన్నికలు ప్రచార గడువు సమీపిస్తుండడంతో నియోజకవర్గంలో రోజురోజుకు ఎన్నికల వేడి పెరుగుతున్నది. మరోవైపు అలంపూర్ నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జి చల్లా వెంకట్రామిరెడ్డి గాలి ప్రభావంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏకమై ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ కంటే ముందు నియోజకవర్గంలో కొంతమంది నాయకులు అసమ్మతి రాగం వినిపించిన విషయం తెలిసిందే. అయితే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు బీ ఫారం అందకున్న తర్వాత నియోజకవర్గంలో ఎన్నికల ముందున్న రెండు వర్గాలు(ఎమ్మెల్యే అభ్యర్థి సమ్మతి వర్గం, అసమ్మతి వర్గం) చల్లా నేతృత్వంలో గల్లీ లీడర్ నుంచి జిల్లా స్థాయి లీడర్లతో చర్చించి అందరూ ఏకమై తమ దైన శైలిలో దూసుకుపోతున్నారు. బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి విజయుడి అడుగులో అడుగులు వేస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రతిగడప తొక్కుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టో అంశాలు వివరించి ఓటు అడుగుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో సీఎం కేసీఆర్ హయాంలో ప్రభుత్వం సంక్షేమ పతకం అందని ఇల్లు లేదంటే అతిషయోక్తి కాదు. మూడు వందల పథకాలకుపైనే అమలు చేస్తున్న బీఆర్ఎస్‌ను ఎదుర్కొనడానికి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ప్రవేశ పెడితే నేడు ఓటర్లు నమ్మె పరిస్థితుల్లో లేరు. గత ఎన్నికల్లో నే కాదు, ఈ ఎన్నికల్లో కూడ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల రేసులో లేదనే చెప్పాలి. స్వాతంత్ర్య వచ్చినప్పటి నుంచి పలు పర్యాయాలు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం సాధించిందని ప్రజలు అభ్యర్థులను నిలదీయడం గమనార్హం. బీఆర్ఎస్ అభ్యర్థి ఏ గ్రామం వెళ్లిన ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. ప్రజలు పార్టీపై అభిమానంతో తండోప తండాలుగా తరలివస్తున్నారు.బీఆర్ఎస్ అభిమానుల దండును చూసి ప్రతి పక్షాలు గుండెలు బాదుకుంటునే పరిస్థితి ఏర్పడింది.బీఆర్ ఎస్ అబ్యర్థి విజయుడు నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జ్,ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నేతృత్వంలో సలహాలు,సూచనలు, ఆదేశాలు పాటిస్తు ఉదయం ,సాయంత్రం అనే తేడా లేకుండా నిత్యం ప్రజల్లో మమేకమై ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు.రోజు రోజుకు బీఆర్ఎస్ పార్టీ చేరికలతో బలం పుంజుకుంటుంది.బీఆర్ఎస్ నాయకత్వం గెలుపుతో పాటు మెజార్టీయో లక్ష్యంగా ముందుకు దూసుకుపోతున్నారు.

## లక్ష్మీవేంకటేశ్వరస్వామికి రూ.1,11,116 వితరణ

కేటీదొడ్డి, నవంబర్ 13: పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారికి రాయచూర్ జిల్లా, యాపలదిన్నెకు చెందిన జములమ్మ, కిష్టప్పదంపతులు ఆలయంలో భక్తులకు అందించే శాశ్వత అన్నదానం కోసం రూ.1,11,116 నగదును ఆలయ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పెద్దలు, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కే మా మద్దతు

అలంపూర్, నవంబర్13: ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ఎమ్మార్పీ ఎస్ తెలంగాణ అధ్యక్షుడు వంగపల్లి శ్రీ నివాస్ మాదిగ ఆదేశాల మేరకు అలంపూరులో కూడ మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రసిడెంట్ బల్గర హుసేన్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం అలంపూర్‌లో విలేకరులతో మాట్లాడారు. అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి నాయకత్వంలో విజయుడు గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కేసీఆర్ పాలనలోనే మాదిగలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రేమదాసు, వెంకటేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు